సాక్షి
మంచిర్యాల
మంగళవారం, 25, ఏప్రిల్, 2023



ఆటలు ఆడేదెలా..? 8లో▸

రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో సమస్యలు తిష్టవేశాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ స్టేడియం నేడు కళావిహీనంగా మారింది. సింగరేణి అధికారుల పట్టింపు కరువైంది.



గ్రీవెన్స్‌కు స్పందన కరువు

మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణికి స్పందన కరువైంది. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు కలెక్టరేట్ తరలివెళ్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0 /25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

సాక్షి ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ ఉచిత శిక్షణ



బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: వేసవి సెలవుల దృష్ట్యా 'సాక్షి' ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని రంగంపేటలో ఉన్న మాస్టర్ బ్యాడ్మింటన్ అకాడమీ సహకారంతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 28నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు శిక్షణ ఉంటుంది. 6 నుంచి 15ఏళ్లలోపు బాలబాలికలు బ్యాడ్మింటన్ ఉచిత శిక్షణ పొందవచ్చు. వివరాలకు బ్యాడ్మింటన్ కోచ్ నాగేంద్ర 8978753944, సాక్షి రిపోర్టర్ 9949153168 నంబరులో సంప్రదించి, ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

క్వారీ కాంట్రాక్టర్లకు భారీ జరిమానా

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారు సర్వే నెంబరు 139లో గుట్ట తవ్వకాలు చేపడుతున్న ఇద్దరు కాంట్రాక్టర్లకు మైనింగ్ శాఖ అధికారులు భారీ జరిమానా విధించారు. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా పెద్ద ఎత్తున గుట్ట తవ్వకాలు చేపడుతుండడంతో కాంట్రాక్టర్ భీమా సుధాకర్‌కు రూ.కోటి 62 లక్షలు, భుక్య మోహన్‌కు రూ.కోటి 40 లక్షలు జరిమానా విధించినట్లు మైనింగ్ శాఖ ఇన్‌చార్జి ఏడీ బాలు సోమవారం తెలిపారు.

గంజాయి మత్తులో యువకుడి వీరంగం!

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రం మంచిర్యాల పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఓ యువకుడు (19) గంజాయి మత్తులో వీరంగం సృష్టించినట్లు తెలిసింది. ఇంట్లో తల్లిదండ్రులతో గొడవపడి తాగడానికి డబ్బులు కావాలంటూ మత్తులో ఇంట్లోని వస్త్రాలు తగులబెట్టినట్లు సమాచారం. ఈ విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా.. ఘటన జరిగింది వాస్తవమేనని తెలిపారు. స్థానికులు డయల్ 100కు కాల్ చేయడంతో బ్లూ కోల్ట్ కానిస్టేబుళ్లు, ఎస్సై సంఘటన స్థలానికి వెళ్లి మత్తులో ఉన్న యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కాగా, యువకుడికి సంబంధించి వివరాలు వెల్లడించడానికి పోలీసులు ఆసక్తి చూపకపోవడం గమనార్హం.

'ఎర్రకోటపై ఎగిరేది బీఆర్‌ఎస్ జెండానే..'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వచ్చే ఎన్నికల్లో ఎర్రకోటపై ఎగిరేది బీఆర్‌ఎస్ పార్టీ జెండానేనని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు జోస్యం చెప్పారు. సోమవారం హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలోని పద్మావతీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న పార్టీ ఆవిర్భావ ప్లీనరీ కోసం 25న నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సమావేశంలో విధిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇక దేశం మొత్తం బీఆర్‌ఎస్ వైపు చూస్తోందని, రాష్ట్రంలోని సంక్షేమ పథకాలు ఎక్కడా అమలు కావడం లేదని వివరించారు. బీజేపీ ఆయా రాష్ట్రాల్లో దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో సింగరేణి ప్రైవేటీకరణలో బీజేపీ వ్యవహారంపై తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, మాజీ చైర్మన్ సాగి వెంకటేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సందెల వెంకటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్, నాయకులు నడిపెల్లి విజిత్‌బాబు, మందపల్లి శ్రీనివాస్, గాదె సత్యం, ఓలపు రమేశ్ పాల్గొన్నారు.

నేలవాలిన వరిపైరు



మాకులపేటలో పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో

దండేపల్లి: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన గాలివానకు పలు చోట్ల వరిపైరు నేలవాలింది. తాళ్లపేట, నాగసముద్రం, మాకులపేట, అల్లీపూర్ శివారుల్లో సుమారుగా 360 ఎకరాల్లో వరి పైరు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఏవో గొర్ల అంజిత్‌కుమార్ తెలిపారు. నష్టపోయిన పంటలను ఏఈవోలు సోమవారం పరిశీలించి వివరాలు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పద్మవ్యూహంలో పట్టణం..!



లక్ష్మీ థియేటర్ చౌరస్తా వద్ద జంక్షన్ అభివృద్ధి పనులతో ట్రాఫిక్

- అన్ని ప్రధాన రోడ్ల వద్ద అభివృద్ధి పనులు
- ట్రాఫిక్ జామ్, దుమ్ముతో ప్రజల ఇబ్బందులు
- అస్తవ్యస్తంగా వెళ్తున్న వాహనదారులు
- జంక్షన్ల వద్ద అడ్డా వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు



జిల్లా కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు



రోడ్డును కమ్మేస్తున్న దుమ్ము

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాల పట్టణం పద్మవ్యూహంలా మారింది. పట్టణంలో అభివృద్ధి పనులు, రోడ్డు వెడల్పు కొత్త రోడ్ల వేసే పనులన్నీ ఒకేసారి చేపట్టడంతో ఓ వైపు నుంచి మరోవైపు వెళ్లాలంటే ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పట్టణ ప్రజలతోపాటు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే వారు, కుమురంభీం జిల్లా, పెద్దపల్లి జిల్లా, మహారాష్ట్రకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేషనల్ హైవే, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ శాఖ నుంచి ఒకేసారి పనులు చేపట్టడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ప్రజలకు తప్పడం లేదు. రోడ్లు, జంక్షన్ల అభివృద్ధి పనులతో వాహనాలు వెళ్లడం కష్టంగా మారి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జంక్షన్ల అభివృద్ధి పనులతో రోడ్లు ఇరుకుగా మారగా, ఆ జంక్షన్ల వద్దనే ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టడం వల్ల ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతూ.. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. ఒకేసారి అన్ని పనులు ప్రారంభించి చేపడుతుండడంతో మంచిర్యాల పట్టణంలోకి వచ్చిన వాహనాలు, వారు వెళ్లాల్సిన గమ్యస్థానానికి వెళ్లేందుకు పద్మవ్యూహం లాంటి అడుగడుగునా ఉన్న ట్రాఫిక్ ఇబ్బందులను దాటి వెళ్లాల్సి వస్తోంది. దీనికి తోడు రోడ్లన్నీ మట్టితో నిండి, వాహనాలు వెళితే లేచే దుమ్ము, వెనక వచ్చే వారికి ఇబ్బందిగా మారుతోంది. దీంతో వాహనదారులు వెళ్లాల్సిన చోటుకు ఆలస్యంగా వెళ్లడంతోపాటు దుమ్ముతో అనారోగ్యానికి గురవుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం



ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో పట్టణ సుందరీకరణలో భాగంగా అభివృద్ధి పనులు, రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నాం. బైపాస్ రోడ్డు పనులు ఆలస్యం కావడంతో జంక్షన్ల అభివృద్ధి పనులకు కొంత ఇబ్బందిగా మారుతోంది. ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు జంక్షన్ల వద్ద సర్కిల్ నిర్మాణ పనులను పూర్తి చేశాం. ఇకపై సర్కిల్ లోపలే పనులను చేపడతాం. జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బందులు లే కుండా రోడ్డును కొంత వెడల్పు చేస్తున్నాం. దుమ్ము రాకుండా నీరు చల్లడం, దుమ్మును తొలగించే పనులు పూర్తి చేస్తాం.

– మధుకర్, మంచిర్యాల మున్సిపల్ ఇంజినీర్

ఒకేసారి చేయడం వల్లనే



పట్టణంలో అభివృద్ధి పనులు చేయడం మంచిదే. కానీ ఒకేసారి అన్ని రోడ్ల పనులను చేపట్టడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. బైపాస్ రోడ్డు పనులను పూర్తి చేయకుండానే ప్రధాన రహదారిపై జంక్షన్ల అభివృద్ధి పనులను ప్రారంభించడంతో భారీ వాహనాలు, లారీలు ప్రధాన రహదారి గుండా వస్తున్నాయి. ట్రాఫిక్‌కు చాలా ఇబ్బందిగా మారి, ఏ వాహనం ఎటు పోతుందో అర్థం కావడం లేదు. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది.

– మందల శ్రీనివాస్, మంచిర్యాల

సమన్వయ లోపంతోనే..

మంచిర్యాల పట్టణంలో బైపాస్ రోడ్డు పనులను ఏడాదిన్నర క్రితం ప్రారంభించగా నత్తనడకన చేపడుతున్నారు. రూ.7 కోట్లు కేటాయించి ఒకటిన్నర కిలోమీటర్ దూరం వేయాల్సిన రోడ్డు పనులు సగం మాత్రమే పూర్తి చేశారు. ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని పూర్తిచేస్తే బైపాస్ రోడ్డు నుంచి లారీలు, ఇతరత్రా భారీ వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉన్నా, ఆ దిశగా మున్సిపల్ అధికారులు రోడ్డు పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో లారీలు, భారీ వాహనాలు మంచిర్యాల పట్టణం నుంచే వెళ్తున్నాయి. ఇదే సమయంలో గత నెలలో జిల్లా కేంద్రంలోని నాలుగు జంక్షన్ల అభివృద్ధి పనులను మున్సిపల్ శాఖ కేటాయించిన రూ.4 కోట్లతో ప్రారంభించారు. నాలుగు జంక్షన్ల వద్ద ఐలాండ్ మాదిరిగా నిర్మాణ పనులు ప్రస్తుతం చేస్తున్నారు. రోడ్డు వెడల్పు పనులను చేపట్టకుండానే, జంక్షన్ల అభివృద్ధి పనులు చేపట్టడం, బైపాస్ రోడ్డు పూర్తి కాకపోవడంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి నుంచే అన్ని వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఐబీ చౌరస్తా నుంచి ఏసీసీ వరకు పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంటు నుంచి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ఎత్తు పెంచేందుకు పనులు చేపడుతున్నారు. దీంతో డివైడర్ పక్కనే ఇసుక, కంకర వేయడం వల్ల వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి నుంచి పాతమంచిర్యాల రాళ్లవాగు బ్రిడ్జి వరకు రోడ్డుకిరువైపులా ఎన్‌హెచ్–63ను విస్తరించేందుకు గాను రూ.14 కోట్లతో ఇటీవల జాతీయ రహదారుల ఆధ్వర్యంలో రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించారు. దీంతో హైటెక్ సిటీ కాలనీ నుంచి ఐబీ చౌరస్తా వరకు, ఐబీ చౌరస్తా నుంచి పాతమంచిర్యాల రాళ్లవాగు వరకు చేపట్టే పనులతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారులు, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ శాఖల ద్వారా చేపట్టే పనులను సమన్వయంతో చేపడితేనే ప్రజలకు ఇబ్బందులు కొంతవరకు తప్పే అవకాశం ఉంది.

జాతరకు సీఎస్‌ఐ చర్చి ముస్తాబు



ముస్తాబైన సీఎస్‌ఐ చర్చి

లక్సెట్టిపేట: లక్సెట్టిపేటలోని సీఎస్‌ఐ చర్చి ఏసు క్రీస్తు పునరుత్థాన మహోత్సవ ప్రాంతీయ జాతరకు ముస్తాబైంది. ఈ నెల 25, 26న చర్చి ఆవరణలో నిర్వహించే జాతరకు సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది క్రైస్తవులు తరలిరానున్నారు. ప్రత్యేక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను చర్చి కమిటీ సభ్యుడు ఫాదర్ కరుణాకర్ పర్యవేక్షిస్తున్నారు. జాతర పోస్టర్లను స్థానిక ఫాదర్ నివాస గృహంలో విడుదల చేసి అన్ని ప్రదేశాలకు చేరవేశారు. 25న ఉదయం గ్రామాల్లో పర్యటిస్తూ అందరినీ ఆహ్వానిస్తారు. సాయంత్రం ఊత్కూరు చౌరస్తా నుంచి పెద్ద ఎత్తున క్రైస్తవులు ర్యాలీగా చర్చి వద్దకు వస్తారు. ఏడు గంటలకు సిలువ వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసి కీర్తనలు పాడుతారు. 26న ఉదయం నుంచి చర్చిలో ప్రత్యేక కీర్తనలు పాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం సిలువ గుట్టపైకి వెళ్లి కొవ్వొత్తులు వెలిగిస్తారు. జాతర ప్రదేశంలో దుకాణ సముదాయాలతో సందడి వాతావరణం నెలకొంటుంది.

బుగ్గలో జిల్లా న్యాయమూర్తి ప్రత్యేక పూజలు



న్యాయమూర్తికి సర్పంచ్, ఆలయ కమిటీ సన్మానం

బెల్లంపల్లిరూరల్: జిల్లా న్యాయమూర్తి బి.సత్తయ్య మండలంలోని కన్నాల శివారులో ఉన్న బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పూర్ణకుంభం, మంగళహారతితో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం న్యాయమూర్తి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ బుగ్గ ప్రాంతం ఆహ్లాదకరమైన ప్రశాంత వాతావరణంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లిరూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, తాళ్లగురిజాల ఎస్సై నరేష్, కన్నాల సర్పంచ్ స్వరూప, ఆలయ ఈవో బాపురెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూకబ్జాలు.. నకిలీ నంబర్లు..!

- మున్సిపాలిటీలోని హన్మాన్‌బస్తీకి చెందిన దోలి సుకుమార్, అతడి భార్య, కొడుకు ఈ నెల 22న తమ అధీనంలో ఉన్న ఉన్న భూమిని కొందరు కబ్జా చేస్తున్నారని, న్యాయం చేయాలని మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశారు.
- మున్సిపాలిటీలోని బూడిదగడ్డబస్తీకి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు ముద్రగడ లక్ష్మీనారాయణ కంపెనీ క్వార్టర్ సొంతం కోసం జీవో 76 ప్రకారం దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వానికి రూ.2,500 చలానా కట్టాడు. తీరా రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే ఆ క్వార్టర్ ఇంటినంబరుపై వివాదం ఉందని రిజిస్ట్రేషన్ చేయకుండా పంపించారు.



ప్రభుత్వానికి సింగరేణి స్వాధీనం చేసిన ఓ కార్మికవాడ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో అక్రమాలు, అవకతవకలకు అంతు లేకుండా పోతోంది. భూమి కబ్జా చేస్తూ ప్లాట్లు చేసి విక్రయిస్తుండగా.. ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం ఇంటి నంబర్లను తారుమారు చేసి అర్హులకు అన్యాయం చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. బెల్లంపల్లి మండలం బుధాకలాన్ శివారు సర్వే నంబరు 170లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఆ భూభాగంలోనే మున్సిపాలిటీ విస్తరించి ఉంది. సింగరేణి లీజు భూములూ వేలాది ఎకరాల్లో ఉన్నాయి. గత ఐదేళ్ల క్రితం సింగరేణి యాజమాన్యం ఉపయోగంలో లేని ఖాళీ భూములు, వందల సంఖ్యలో కంపెనీ క్వార్టర్లను ప్రభుత్వ పరం చేసింది. వాటిపై కన్నేసిన కొందరు ఆక్రమణకు యత్నాలు చేస్తున్నారు. ఖాళీ భూములను కబ్జా చేసి స్వాధీనం చేసుకుంటున్నారు. ఇంకొందరు ఓ అడుగు ముందుకేసి దొడ్డి దారిన నకిలీ పత్రాలు సృష్టించి హక్కుదారులమని బుకాయిస్తున్నారు. దశాబ్దాలుగా సింగరేణి ఆధీనంలో ఉన్న భూములకు సైతం పత్రాలు తయారు చేయించడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఇళ్ల నంబర్ల కేటాయింపులో గోల్‌మాల్

ప్రభుత్వ, సింగరేణి లీజు భూముల్లో స్థిర నివాసాలు ఏర్పర్చుకున్న వారి ఇళ్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం 76, 58, 59 జీవోలను విడుదల చేసింది. అర్హులు ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రయత్నాలు చేస్తుండగా.. మరోపక్క కొందరు అక్రమ మార్గాన మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబరు తీసుకుని పోటీగా దరఖాస్తు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకే ఇంటి కోసం ఇద్దరు వ్యక్తులు దరఖాస్తు చేస్తుండడంతో వివాదాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం నివాసం ఉంటున్న కంపెనీ క్వార్టర్‌కు మున్సిపాలిటీ నుంచి కొత్తగా బై నంబర్ ఇప్పించి గోల్‌మాల్ చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా నివాసం ఉండకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిన కొందరి క్వార్టర్లకు కొత్త నంబర్లు ఇప్పించడంతో ఇళ్ల క్రమబద్ధీకరణకు చిక్కుముడులు ఏర్పడుతున్నాయి. అద్దెకు ఉంటున్న వ్యక్తులు కొందరు దళారులను ఆశ్రయించి నకిలీ పత్రాలు తయారు చేసుకుని గొడవకు దిగడం జరుగుతోంది. ఇంటి నంబర్ల వ్యవహారంలో కొందరు ఒక్కొక్కరి నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మున్సిపల్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో అక్రమంగా ఇంటి నంబర్లు ఇప్పించినట్లుగా తెలుస్తోంది. మరోవైపు ఇంటి నిర్మాణాలకు పిల్లర్‌కో ధర లెక్కన వసూలు చేయడం, లేనిపక్షంలో ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు సృష్టించడం పరిపాటిగా మారింది.

సరి చేయడానికి ప్రయత్నిస్తాను

ఇంతకుముందు జారీ చేసిన ఇంటినంబర్లలో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని పరిశీలించి సవరించడానికి చర్యలు తీసుకుంటాను. నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా చూస్తాను. నా హయాంలో ఇంటి నంబర్ల జారీలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా వ్యవహరిస్తాను.

– కె.సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్ బెల్లంపల్లి

భూముల ఆక్రమణను సహించం

ప్రభుత్వ భూముల ఆక్రమణను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడానికి చర్యలు చేపడతాం. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి భూకబ్జాలను తీసుకెళ్తున్నాం. అక్రమార్కులు ఎంతటి వారైనా వదిలిపెట్టం. చట్టపరంగా వ్యవహరిస్తాం. దళారుల మాటలు నమ్మొద్దు.

– కుమారస్వామి, తహసీల్దార్, బెల్లంపల్లి

సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: వివిధ సమస్యలపై అర్జీదారులు అందించిన దరఖాస్తులు పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ, ధరణిలో పోర్టల్ తప్పుగా నమోదు అయ్యాయని, విద్యుత్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాలుగు వరుసల రహదారిలో కోల్పోయిన పది గుంటల భూమికి పరిహారం అందించాలని కాసిపేట మండలం పెద్దనపల్లి గ్రామానికి చెందిన సిరబోయిన కిష్టయ్య కోరాడు. చెన్నూర్ బలరామ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ చైర్మన్ రత్న లక్ష్మీనారాయణ వడ్ల కొనుగోలు కేంద్రాలను కేటాయించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని మంచిర్యాలకు చెందిన రౌతు రవితేజ, రౌతు శివతేజ అర్జీ అందజేశారు.

పింఛన్ రావడం లేదు



పుట్టిన పదేళ్ల నుంచి కాలు చచ్చుబడిపోయింది. దివ్యాంగుల సర్టిఫికెట్ 2017లో ఇచ్చారు. అప్పటి నుంచి పింఛన్ వస్తుంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి నిలిపివేశారు. సదరం సర్టిఫికెట్ రెన్యూవల్ కోసం పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు రాలేదు. పింఛన్ అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా.


– పలెర్ల సునిత, మందమర్రి

దివ్యాంగ సర్టిఫికెట్ అందించాలి



2021లో అగ్నిప్రమాదంలో శరీరంలోని కొంతభాగం కాలి పోయింది. కుడి అర చేయి మొత్తం కాలిపోవడంతో వైద్యులు తొలగించారు. నాకు ఎలాంటి బతుకు దెరువు, జీవనధారం లేదు. ఒక్కచేతితో ఏ పనీ చేయలేకపోతున్నా. దివ్యాంగ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నా రాలేదు. తొలగించిన చేయి చూసి అయిన దివ్యాంగ సర్టిఫికెట్ అందించి పింఛన్ మంజూరు చేయాలి. – జుమ్మిడి రాయమల్లు, జైపూర్

మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది వినతి



ఆంగ్ల మాధ్యమ పాఠశాల మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది కృషి మూలంగా ఫలితాలు, అభివృద్ధి సాధిస్తున్నాయి. సిబ్బంది వేతనాలు అందక ఇబ్బంది పడాల్సి వస్తుంది. వేతనాలు, పీఎఫ్‌ఎంఎస్ ద్వారా కాకుండా ప్రతీ నెల కేజీబీవీల మాదిరిగా హాస్టల్స్ ఉద్యోగులకు డైరెక్టుగా అకౌంట్లో వేయాలి. సమాన పనికి సమాన వేతనాలు బేసిక్‌ను నిర్ణయించి పెంచడంతోపాటు 8 గంటల పని దినాన్ని అమలు చేయాలి. జాబ్‌కార్డు, వీక్లీ ఆఫ్, ప్రభుత్వ గుర్తింపు కార్డు, మెడికల్ ఇన్సూరెన్స్ తదితర సమస్యలు పరిష్కరించాలి.

సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించుకోవాలి



సెల్‌ఫోన్ అందజేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఇదివరకు పోగొట్టుకున్న కొందరి వ్యక్తుల ఫోన్లను ఇటీవల కొత్తగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పట్టుకున్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాలకు చెందిన ఐదుగురు బాధితులకు కమిషనరేట్‌లో సీపీ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎవరైన సెల్ పోగొట్టుకున్న వారు www.ceir.gov.in పోర్టల్‌లో మొబైల్ ఐఎంఈఐ నంబర్, ఫోన్ నంబర్ పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సీఈఐఆర్ వారు మొబైల్ లాక్ చేసి ట్రేస్‌డ్ డీటెయిల్స్‌లోకి వెళ్లి వారి మొబైల్‌లో సిమ్ కార్డ్ వేసిన వారి వివరాలు తెలుసుకుంటారని, అప్పుడు ఫోన్ దొరికిపోతుందని తెలిపారు. డీసీపీలు సుధీర్ రాంనాథ్ కేకన్, వైభవ్ గైక్వాడ్, ఏసీపీలు తిరుపతిరెడ్డి, మహేష్, నరేందర్ పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: నిబంధనలు పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యపేరిట వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. అనుమతులు లేకపోయినా అడ్మిషన్లు చేస్తున్నారని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్ నవీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ బాధ్యులు సత్యనారాయణ, అభినవ్, రాకేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలు మృతి


రాజవ్వ మృతదేహం

దండేపల్లి(మంచిర్యాల): విద్యుత్ తీగ తెగిపడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తాళ్లపేటకు చెందిన గోపతి రాజవ్వ (72) సోమవారం ఉదయం తన ఇంటిముందున్న మరో ఇంటికి వెళ్లి వస్తుండగా స్తంభానికి ఉన్న తీగ ప్రమాదవశాత్తు తెగి వృద్ధురాలిపై పడింది. విద్యుత్‌షాక్‌కు గురికావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతురాలి కుమారుడు శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

బెల్లంపల్లిలో ఇద్దరికి కరోనా

బెల్లంపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కోవిడ్ అనుమానిత లక్షణాలున్న 14 మంది సోమవారం కరోనా పరీక్షలు చేయించుకోగా ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ అయినట్లు వైద్యసిబ్బంది పేర్కొన్నారు. పట్టణానికి చెందిన ఇద్దరు కోవిడ్ బారిన పడడంతో వారిని హోం క్వారంటైన్‌లో ఉండాలని ఇంటికి పంపించారు. నిబంధనలు పాటించాలని వైద్యులు సూచించారు.

రూ.21.30లక్షల నకిలీ నోట్లు పట్టివేత


నిందితుడు హిప్రె తిరుపతి

వాంకిడి(ఆసిఫాబాద్): కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలో తరలించడానికి సిద్ధంగా ఉన్న రూ.21.30లక్షలు విలువైన కరెన్సీ నోట్లను ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం వాంకిడికి చెందిన హిప్రె తిరుపతి నకిలీ నోట్ల ముఠాతో చేతులు కలిపి కరెన్సీ నోట్ల దందా చేస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు అతడి ఇంట్లో ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించగా భారీగా నకిలీ కరెన్సీ నోట్లు పట్టుబడ్డాయి. రూ.21.30లక్షలు విలువైన రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని అమాయక ఆదివాసీ ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. నకిలీ నోట్లకు తేడా లేకుండా ఉన్నందున రూ.లక్ష ఒరిజినల్ నోట్లకు రూ.3 లక్షలు చొప్పున వ్యాపారం సాగిస్తున్నారని, పట్టుబడిన నకిలీ నోట్లను సీజ్ చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గొర్రెల పెంపకం దారులకు అవగాహన

జన్నారం(ఖానాపూర్): రెండో విడత గొర్రెల పంపిణీపై సోమవారం మండల కేంద్రంలో 13 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సొసైటీలు, యాదవులు, గొర్రెల కాపరులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేశ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గొర్రెల పెంపకంలో మెలకువలు, రోగాలు రాకుండా తీసుకునే జాగ్రత్తలు, డీడీలు కట్టడం, గొర్రెల ఎంపిక, ట్రాన్స్‌పోర్టు, సొసైటీ ఎన్నికల నిర్వహణ, పశువుల మేత, పశుపోషణ, పెంపకం, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీకాంత్, తపాలాపూర్, ఇందన్‌పల్లి గ్రామాల పశువైద్యాధికారులు కిరణ్‌కుమార్, రాజుకుమార్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు బొంతల మల్లేశ్, ఉపాధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటలు ఆడేదెలా?

- ఆర్కేపీ ఠాగూర్ స్టేడియంలో సమస్యల తిష్ట
- నిత్యం గ్రౌండ్‌లోనే సంచరిస్తున్న పశువులు
- ఆనవాళ్లు కోల్పోయిన వాకింగ్ ట్రాక్, క్రికెట్ పిచ్
- పట్టించుకోని సింగరేణి అధికారులు



ఠాగూర్ స్టేడియం ముఖద్వారం

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి చరిత్రలోనే ఓ ప్రత్యేక గుర్తింపు సాధించుకున్న రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో సమస్యలు తిష్ట వేశాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ స్టేడియం నేడు కళావిహీనంగా మారింది. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను అందించిన చరిత్ర ఈ స్టేడియానికి ఉంది. సింగరేణి వ్యాప్తంగా ప్రత్యేకతను సంతరించుకున్న స్టేడియం ప్రస్తుతం నిర్వహణలో గాడి తప్పింది. క్రీడాకారులు, ఔత్సాహికులతో కిటకిటలాడాల్సిన స్టేడియం నిత్యం పశువులతో దర్శనమిస్తోంది. భయభ్రాంతులకు గురిచేసేలా తయారైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికంతటికీ నిర్వహణలో లోపాలు, వైఫల్యాలే ప్రధాన కారణమని క్రీడాకారులు, పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

లక్షలాది రూపాయలు మట్టిపాలు

సువిశాలమైన మైదానంతో సింగరేణి వ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన స్టేడియంలో కొన్నాళ్ల క్రితమే లక్షలాది రూపాయలు వెచ్చించి వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ఇటీవల జరిగిన కోలిండియా క్రికెట్ పోటీల్లో భాగంగా సుమారు రూ.50 లక్షలు వెచ్చించి హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియం తరహాలో అంతర్జాతీయ నిపుణులతో టర్ఫ్ క్రికెట్ పిచ్ ఏర్పాటు చేశారు. అయితే అటు వాకింగ్ ట్రాక్‌తో పాటు క్రికెట్ పిచ్ ప్రస్తుతం నామరూపాల్లేకుండా పోయాయి. దీంతో లక్షలాది రూపాయలు మట్టిపాలయ్యాయని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

నిత్యం స్టేడియంలోనే పశువులు

'ఎవరు పడితే వారు వచ్చి ఆడడానికి ఇది మీ క్రీడా ప్రాంగణం కాదు.. ఇది మా అడ్డా. మా బందెల దొడ్డి' అన్నట్లు ఉంది ఠాగూర్ స్టేడియంలోని పరిస్థితి. నిత్యం స్టేడియంలో పశువులు సంచరిస్తుండడంతో వ్యాయామం..వాకింగ్ చేసేందుకు వచ్చే వారు, క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పుడప్పుడు మనుషులపైకి ఎగబడుతుండటంతో చాలామంది బిక్కుబిక్కుమంటూ వాకింగ్ చేస్తున్నారు. చిన్నపిల్లలతో వచ్చే కొందరు పశువుల భయానికి స్టేడియానికి రావడమే మానేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా స్టేడియంలో కుక్కలు, పాముల బెడద కూడా తీవ్రంగానే ఉంది.

కనీస సౌకర్యాలు కరువు

విశాలమైన స్టేడియంగా గుర్తింపు ఉన్నప్పటికీ కనీస సౌకర్యాలు కరువయ్యాయి. స్టేడియంలో వాకింగ్ కోసం వచ్చే ప్రజలకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు. ఇక మరుగుదొడ్లు అసలే లేవు. వాకింగ్, జాగింగ్ చేసి అలిసిపోయే వారి కోసం కూర్చునేందుకు వీలుగా బల్లలు కూడా ఏర్పాటు చేయలేదు. ఇంత పెద్ద స్టేడియానికి కనీసం ఒక వాచ్‌మెన్‌ను కూడా నియమించలేదంటే సింగరేణి అధికారుల నిర్లక్ష్యం ఇట్టే అర్థమవుతోంది. క్రీడాకారులకు పుట్టినిళ్లుగా పేరున్న రామకృష్ణాపూర్‌పై సింగరేణి అధికారులు వివక్షను మాని స్టేడియంలో కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని క్రీడాకారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకుంటలేరు



ఠాగూర్ స్టేడియంను సింగరేణి అధికారులు పూర్తిగా పట్టించుకుంటలేరు. గతంలో క్రీడాకారులతో స్టేడియం కళకళలాడేది. ఇందులో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పిచ్ పూర్తిగా కనుమరుగైంది. క్రీడాకారులకు కనీస వసతులు లేవు. ఇప్పటికైనా అధికారులు స్టేడియం నిర్వహణపై దృష్టి సారించాలి.

– నూనె శ్రీనివాస్, సీనియర్ క్రికెట్ ప్లేయర్

తాగునీరు కూడా లేదు



ఇంత పెద్ద స్టేడియంలో కనీసం తాగునీటి సౌకర్యం లేదు. వాకింగ్ కోసం అధిక సంఖ్యలో జనం వస్తున్నారు. స్టేడియంలో తిష్ట వేస్తున్న పశువుల కారణంగా భయాందోళనకు గురవుతున్నారు. టాయిలెట్స్ కూడా లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు అధ్వానంగా తయారయ్యాయి.

– బెల్లం శ్రీనివాస్, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు

చెన్నూర్‌లో మహారాష్ట్ర తాటిముంజలు


తాటిముంజలు విక్రయిస్తున్న మహారాష్ట్ర మహిళలు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలో మహారాష్ట్ర తాటిముంజలకు మంచి డిమాండ్ ఉంటోంది. మహారాష్ట్రలోని సిరొంచ తాలుకా నుంచి గిరిజన మహిళలు తాటిముంజలు తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. రూ.10కి ఐదు చొప్పున ఇస్తున్నారు. మూడేళ్లుగా ఇక్కడ తాటిముంజలు విక్రయిస్తున్నామని, ఈ ఏడాది వ్యాపారం బాగుందని మహారాష్ట్రకు చెందిన లక్ష్మి, గంగుబాయి తెలిపారు.

జైపూర్ గురుకులంలో సమ్మర్ స్పార్కిల్స్

జైపూర్(చెన్నూర్): మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో సోమవారం సమ్మర్ స్పార్కిల్స్ కార్యక్రమం ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ బాలభాస్కర్ తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించడానికి, వారిలో స్కిల్స్ డెవలప్ చేయాలన్న ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. డ్యాన్స్, సింగింగ్, డిటార్, ఆటలు, ఫన్‌గేమ్స్‌లలో 15 రోజుల పాటు హైదరాబాద్‌లోని శిక్షణ బృందంచే విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

సీహెచ్‌పీ కార్మికులకు సేఫ్టీ జాకెట్స్ ఇవ్వాలి


కార్మికుల సమస్యలు తెలుకుంటున్న అన్నయ్య

నస్పూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సేఫ్టీ (రేడియం)జాకెట్స్ వెంటనే పంపిణీ చేయాలని టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు ఢీకొండ అన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీహెచ్‌పీపై అలాయ్ బలాయ్ కార్యక్రమం నిర్వహించారు. కార్మికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా సీహెచ్‌పీ వద్ద డస్ట్ నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బైక్, కార్ పార్కింగ్ షెడ్ వెడల్పు చేయాలని ఆయన సూచించారు. కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ చాట్ల అశోక్, జీఎం కమిటీ సభ్యుడు కాశీరావు, బ్రాంచి కార్యదర్శి కానుగంటి చంద్రయ్య, సీహెచ్‌పీ పిట్ సెక్రటరీ కే.శ్రీనివాసాచారి, నాయకులు ఓరమ్ జగన్, అరకాల శ్రీనివాస్, మోతె రాజలింగు, అశోక్ రెడ్డి, సత్తయ్య, రవి, నారాయణ, గణేశ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపల్లి ఏరియా లేకుండా చేసేందుకు యత్నం

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్


మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల చేతకాని తనం మూలంగా సింగరేణి యాజమాన్యం బెల్లంపల్లి ఏరియానే లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తోందని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం కైరిగూడ ఓసీపీలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియాలో ఉన్న గుర్తింపు సంఘం టీబీజీకేఎస్, ప్రాతినిధ్య సంఘమైన ఏఐటీయూసీ కార్మికులను మోసం చేస్తూ ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సింగరేణి కార్మికులు తీయాల్సిన బొగ్గును ప్రైవేటు ఓబీ కాంట్రాక్టర్ తీసేలా డైరెక్టర్ల నుంచి అనుమతులు వచ్చే వరకు ఆయా సంఘాలు సహకరించాయన్నారు. ప్రతిపక్ష యూనియన్‌గా గుర్తింపు సంఘం వైఫల్యాలను ఎండగట్టాల్సిన ఏఐటీయూసీ తమ సిద్ధాంతాలను మర్చిపోయి టీబీజీకేఎస్‌కు మద్దతు పలుకుతోందన్నారు. టీబీజీకేఎస్ నాయకులకు కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ కార్మికుల మీద లేదన్నారు. గోలేటి-1, 1ఏ భూగర్భ గనులతో పాటు, ఎక్స్‌ప్లోరేషన్ డిపార్టుమెంట్లు వారి చేతకాని తనం మూలంగానే మూసివేశారన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఓజియార్, నాయకులు శంకరయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, జిల్లా అధ్యక్షుడు గౌస్, ఏరియా కార్యదర్శి ఇనూస్, పిట్ కార్యదర్శులు రమేశ్, శ్రీనివాస్, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ త్వరగా పూర్తి చేయించాలి


కలెక్టర్‌తో సింగరేణి డైరెక్టర్ బలరాం

నస్పూర్(మంచిర్యాల): మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని సింగరేణి డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పా ఎస్.బలరాం కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్స్ జనరల్ మేనేజర్ రవి ప్రసాద్, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల జనరల్ మేనేజర్లు బి.సంజీవరెడ్డి, మోహన్‌రెడ్డి, దేవేందర్, పలువురు ఎస్టేట్స్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. పదో తరగతి విద్యార్థులు 686 మంది, ఇంటర్ విద్యార్థులు 1,253 మంది పరీక్షలు రాయనున్నారు. ఇందుకు జిల్లాలో పది కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. మే 12 నుంచి 19 వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు పరిశీలన


మరుగుదొడ్డి పరిశీలిస్తున్న అధికారి

దండేపల్లి(మంచిర్యాల): యూడైస్ ప్లాన్‌లో భాగంగా సోమవారం మండలంలోని నర్సాపూర్, మాకులపేట ప్రాథమిక పాఠశాలలను జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి సప్దర్‌అలీ సందర్శించారు. పాఠశాలల్లో మౌళిక వసతులు పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు పనిచేస్తున్నాయా, వాటికి రన్నింగ్ వాటర్ సౌకర్యం ఉందా? లేదా? అని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఐఎస్ నగేష్, సీఆర్పీ నర్సయ్య ఉన్నారు.

మట్టి పరీక్షలేవి..?

- జాడలేని భూసార పరీక్షలు
- రైతు వేదికల్లో నిరుపయోగంగా పరికరాలు
- రైతులకు భూసారం తెలిసేదెలా..?


రైతులతో కలిసి మట్టి నమూనాలను సేకరిస్తున్న ఏఈవో(ఫైల్)


ఆస్నాదలోని రైతు వేదికలో నిరుపయోగంగా భూసార పరీక్షల కిట్

చెన్నూర్‌రూరల్: పంటల సాగులో మంచి దిగుబడులు రావాలంటే మంచి విత్తనాలు వాడటం, సకాలంలో సస్యరక్షణ చర్యలు ఎంత ముఖ్యమో అంతకంటే ముందుగా భూసార పరీక్షలు చేయడం అంతే ముఖ్యం. ఏటా వానాకాలం, యాసంగి కోతల అనంతరం సాగు పనులు ప్రారంభించక ముందే రైతుల పంట పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు నిర్వహించే వారు. భూసార పరీక్షల అనంతరం నివేదికలను బట్టి రైతులు ఏ పంటలు సాగు చేయాలి. ఎరువులు ఎలా వాడటం తెలుస్తుంది. దీంతో ఎరువులకు అదనపు ఖర్చు తగ్గి రైతులకు ఆదాయం పెంచుకునే అవకాశం ఉంటుంది. నేలలో సారాన్ని తెలుసుకోవడం రైతులకు ఎప్పటికప్పుడు అవసరం. అంతే కాకుండా భూసార పరీక్షల ఫలితాలను బట్టి వ్యవసాయాధికారులు సైతం రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు అందజేయడం ఎంతో సులువు అవుతుంది. కానీ గత నాలుగేళ్లుగా భూసార పరీక్షలు నిర్వహించడం లేదు.

55 క్లస్టర్లలో పరికరాలు..

గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కూడా భూసార పరీక్ష కేంద్రం ఉండేది. గతంలో రైతు వేదికలలో భూసార పరీక్ష కేంద్రాలు లేనప్పుడు ఆదిలాబాద్‌కు మట్టి నమూనాలను పంపించేవారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 55 క్లస్టర్లు ఉన్నాయి. ఈ క్లస్టర్లలో నాలుగేళ్ల క్రితం మినీ భూసార పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూసార పరీక్ష కేంద్రం ద్వారా సుమారు 50భూసార పరీక్షలు చేయవచ్చు. దీంతో నేలల సారాన్ని ఎప్పడికప్పుడు తెలుసుకునే సౌకర్యం కలిగిందని రైతులు ఆశించారు. ఏళ్లు గడుస్తున్నా అవి పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. ఆయా కేంద్రాలలో పరీక్ష కిట్లు ఉన్నప్పటికీ పరీక్షలు నిర్వహించేందుకు కెమికల్స్‌ను పంపిణీ చేయక పోవడంతో పరీక్షలు నిర్వహించ లేకపోతున్నారు. దీంతో భూసార పరీక్షలకు బ్రేక్ పడింది. సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



రైతులు నేరుగా ఆదిలాబాద్‌లోని భూసార పరీక్ష కేంద్రానికి వెళ్లి మట్టి పరీక్షలు చేయించుకోవచ్చు. రైతు వేదికలలో మట్టి పరీక్షల కిట్లను పంపిణీ చేయడం జరిగింది. కానీ కెమికల్స్ లేక పరీక్షలు చేయడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.


–జాడి బాపు, ఏడీఏ, చెన్నూర్

కరెన్సీ సేకరణ అభినందనీయం


ఆరుష్‌ను అభినందిస్తున్న భాస్కర్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: వివిధ దేశాలకు చెందిన కరెన్సీ, కాయిన్స్ సేకరించడం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ చందూరి మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సెవెన్ హిల్స్ హైస్కూల్‌లో ఆరోతరగతి చదువుతున్న విద్యార్థి గోనె ఆరుష్‌రావు సేకరించిన వివిధ దేశాలకు చెందిన 600ల కాయిన్స్, 47 దేశాలకు చెందిన కరెన్సీతో సోమవారం పాఠశాలలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రజాకారుల కాలం నుంచి సేకరించిన కాయిన్స్, వివిధ బ్యాంకుల నోట్స్ సేకరించినందుకు విద్యార్థిని అభినందించారు.

మలేరియాపై అవగాహన కల్పించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు అన్నారు. ఈ నెల 25న ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవగాహన పోస్టర్లను అంటించాలని, ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: గిరిజన అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీఓ కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేస్తారన్నారు. ఓఎస్డీ కిష్టయ్య, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టా ఇప్పించాలని బేల మండలం సైద్‌పూర్‌కు చెందిన పెందూర్ గంగుబాయి కోరాడు.
- కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం జెండగూడ గ్రామానికి చెందిన ఆత్రం భగవంత్‌రావు అర్జీ అందించాడు. అదేవిధంగా గిరి వికాసం పథకం కింద త్రీఫేజ్ విద్యుత్ లైన్ మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు.
- కోళ్లఫారం మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం తేజానాయక్ తండాకు చెందిన రాథోడ్ రామారావు విన్నవించాడు.

చేనేని భీమయ్యకు నివాళి


నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని మద్దిమాడలో ఆదివాసీ అమరుడు చేనేని భీమయ్య 35వ వర్ధంతిని సోమవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం తెప్పటగుళ్లతో ఊరేగింపుగా విగ్రహం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం పెంకుటిళ్లు నిర్మించుకునేందుకు కర్ర తీసుకువస్తున్న ఆదివాసీలపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఎదురొడ్డి ప్రాణాలు వదిలిన భీమయ్య త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రోడ్డ లక్ష్మి, జెడ్పీటీసీ చెంద్రయ్య, సర్పంచ్ ఆడ జంగు, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి కొమ్ముల బాపు, మండలాధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు సోయం జంగు, జిల్లా అధ్యక్షుడు మడావి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు కనకరాజు, నాయకులు భీమిని మహేందర్, రెడ్డి లక్ష్మణ్, మంగ శ్రీకాంత్, సోమని పోశక్క, రెడ్డి భారతి, నాయుడి మల్లేశ్, సంద్ర భూమయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు


ప్రగతి పత్రాలతో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని పాఠశాలలకు ఈ నెల 25 నుంచి సెలవులు ప్రకటించడంతో సోమవారం చివరిరోజు ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ నిర్వహించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రగతి నివేదికలను అందజేశారు. సెలవుల్లో పిల్లలపై జాగ్రత్తలు వహించాలని తల్లిదండ్రులకు సూచించారు. పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య పాల్గొన్నారు.